క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ పట్టణ విస్తృతస్థాయి సమావేశం



నరసరావుపేట: పట్టణంలోని రామిరెడ్డిపేట సన్నిధి ఫంక్షన్‌ హాలులో సోమవారం సాయంత్రం ఐదుగంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్‌ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. పట్టణంలోని వార్డు ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సొసైటీ అధ్యక్షుడు విశ్వనాథం బాధ్యతలు స్వీకారం

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ నూతన అధ్యక్షుడిగా గడిపూడి విశ్వనాథం, డైరెక్టర్లు బండారు వీరాంజినేయులు, గోనుగుంట్ల నాగరాజులు ఆదివారం ఉదయం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో విశ్వనాథం మాట్లాడుతూ రైతులు, సొసైటీ అధికారులు, సిబ్బంది సహకారంతో శావల్యాపురం సొసైటీ అభ్యున్నతికి తన శక్తివంచన లేకుండా వంతు కృషి చేస్తామన్నారు. సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' సభ

శావల్యాపురం: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల కేంద్రం శావల్యాపురంలో విఘ్నేశ్వర డెయిరీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) తెలిపారు. ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పనులను ఆయన పర్యవేక్షించారు. కొండలు మాట్లాడుతూ మండల స్థాయిలో జరుగుతున్న ఈకార్యక్రమానికి వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరు పాల్గొని ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌ సీపీ నాయకులు కొణతం ఏరుకలరెడ్డి, బొల్లా సుబ్బారావు, పాట్టిపాటి శ్రీనివాసరావు, బోడెపూడి శ్రీనివాసరావు, యాగసిరి ఏసురాజు తదితరులు ఉన్నారు.

నాదెండ్ల డిప్యూటీ ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు



నాదెండ్ల: మండల డిప్యూటీ ఎంపీడీఓగా తోకల వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ స్వరూపారాణి చెప్పారు. యడ్లపాడు మండల చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వెంకటేశ్వర్లు పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. గత నెల 30వ తేదీ వరకూ డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేసిన లక్ష్మీనిర్మలకుమారి ఉద్యోగ విరమణ చేసిన విషయం విదితమే. బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

యడ్లపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వమే రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండలంలోని సందెపూడి, జాలాది గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి పర్యటించారు. ఈసందర్భంగా జాలాదిలో రూ.40లక్షల వ్యయంతో వేసిన మెటల్‌ రోడ్లు, సందెపూడిలో రూ.13లక్షలతో వేసిన సీసీ రోడ్లు ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో 7.4 మి.మీ వర్షపాతం

రొంపిచర్ల: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం ఉదయానికి 7.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్‌ కార్యాలయ అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో వర్షాలు లేక సార్వ మెట్టపంటల సాగు నిలిచి పోయింది. కొద్దిపాటి వర్షానికి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఉచిత వైద్య శిబిరంలో 340 మందికి పరీక్షలు

సత్తెనపల్లి: మాగులూరి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భానుప్రకాష్‌ సహకారంతో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో కాటూరి వారిచే ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని డీఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ దరువూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, ఫౌండేషన్‌ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌, కొండవీటి ప్రసాద్‌, ఏపూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వంచన పాలనపై పోరాటం చేద్దాం



చిలకలూరిపేటలో క్యూఆర్‌ కోడ్‌ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌ సీపీ నాయకులు



యడ్లపాడులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పోస్టర్‌, క్యూఆర్‌ కోడ్‌ కరపత్రాలను ఆవిష్కరించిన మాజీ మంత్రి విడదల రజిని

- కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటాం
- మాజీ మంత్రి విడదల రజిని
- పట్టణంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం

చిలకలూరిపేట: వంచనతో కూడిన పాలనపై తిరుగులేని పోరాటం చేద్దామని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాస ప్రాంగణంలో ఆదివారం పట్టణ స్థాయి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కూటమి పాలనలో మోసపోయామని గుర్తిస్తున్నారని, ఎలా మోసపోయింది తెలుసుకుంటున్నారని వివరించారు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పాలన అందిన విషయం ఇప్పుడు ప్రజలు మననం చేసుకుంటున్నారని వెల్లడించారు.

నాడు అలా–నేడు ఇలా...

గత వైఎస్సార్‌ సీపీ పాలనలో ఏ ఇంటికీ ఎన్ని సంక్షేమ పథకాలు లభించాయి, ఏ వార్డులో ఎంత అభివృద్ధి జరిగింది అని చర్చ ఉండేదని, నేడు ఎంత మందిపై కేసులు నమోదు చేశారు అని చర్చ జరుగుతోందని ఎద్దేవా చేశారు. ఇక స్థానిక శాసన సభ్యుడు వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని సైతం తన ఖాతాలో వేసుకొనేందుకు తహతహలాడుతున్నాడని విమర్శించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా నాడు తాను ప్రభుత్వాసుపత్రి నిర్మాణంతో పాటు రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే ప్రభుత్వం మారాక తిరిగి అవే పనులకు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. పురుషోత్తమపట్నం బైపాస్‌వద్ద టీటీడీ కల్యాణమండపం, వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి తన హయాంలో భూమి కేటాయించటంతో పాటు ప్రజల వాటా కింద రూ. 70లక్షలు తానే టీటీడీకి చెల్లిస్తే ఇప్పుడు అదే ప్రదేశంలో ఆయన పేరిట శిలాఫలకం వేసుకున్నారని, ఇది చూస్తే సొమ్ముకరిది, సోకొకరిది సామెత తలపిస్తోందని ఎద్దేవా చేశారు. బైపాస్‌రోడ్డు నిర్మాణానికి సమస్యలన్ని పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం తరుపున భూసేకరణ చేయించి ఇచ్చి తన హయాంలో బైపాస్‌ నిర్మాణ పనులు పూర్తి చేస్తే అది కూడా తానే చేసినట్లు ప్రస్తుత ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇక ఆటోనగర్‌ విషయానికి వస్తే కనీసం ఇరిగేషన్‌ భూములను, ఏపీఐఐసీ కి బదలాయించకుండా కార్మికులను మోసం చేసింది, మభ్యపెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కష్టకాలంలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్‌ దరియావలి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, షేక్‌ యూసుఫ్‌ఆలీ, కొచ్చెర్ల కిషోర్‌, కుప్పాల ప్రభుదాసునాయుడు, బి బాలకోటినాయక్‌, సయ్యద్‌ జమీర్‌, గోపతోటి జాన్‌, బండారు జయకుమార్‌, మైలా రాజేష్‌, శివమణి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

యడ్లపాడు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. యడ్లపాడు మండలంలోని బోయపాలెంలో మండలస్థాయిలో ఆదివారం జోరువానలోనూ బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంక్షేమం అంటే వైఎస్‌ జగన్‌.. వంచన అంటే చంద్రబాబు అన్నారు. గత 14 నెలలుగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని వైఎస్సార్‌ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందించారని తెలిపారు. తల్లికి వందనం లోకేష్‌ మనసులోని పథకం అంటూ చెప్పడం హాస్యస్పదమన్నారు. కూటమి నేతల మోసాన్ని ప్రతి గడపకు చేర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ వలేటి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పాలూరి శ్రీనివాసరెడ్డి, నియోజన యువజన అధ్యక్షుడు ప్రభుదాసు నాయుడు, మండల ఎస్సీసెల్‌ అధ్యక్షుడు వలేటి ఉదయ్‌కుమార్‌, నాయకులు గుత్తా సింగయ్య, బింజు సాంబశివరావు, రావిపాటి చైతన్య, నాగమల్లేశ్వరావు, షేక్‌ జాకీర్‌హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల హర్షం



యడ్లపాడులో విత్తనాలు విత్తుతున్న రైతులు



ఆదివారం కురిసిన వర్షానికి మెత్తబడిన పొలం

- ఎట్టకేలకు కరుణించిన వరుణుడు
- విత్తు పనుల్లో రైతులు నిమగ్నం

యడ్లపాడు: వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు! వాతావరణ శాఖ ఐదు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రకటించిన మేరకు, శుక్రవారం 22.8మిల్లీ మీటర్ల వర్షం కురవగా.. శనివారం ఆగి.. మళ్లీ ఆదివారం 14.2శాతం మి.మీ నమోదు కావడంతో అన్నదాతల్లో కొత్త ఆశలు చిగురించాయి. మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 16వేల ఎకరాలు ఉండగా, వీటిలో ఏటా ఖరీఫ్‌ సీజన్‌లో వివిధ పంటలకు 10,483 ఎకరాలు సాగు అవుతుంది. గతేడాది పత్తి 8,530 ఎకరాలు, మిరప 835 ఎకరాలు సాగు చేశారు. ఈఏడాది పత్తి 85శాతం విత్తుకున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని, విత్తనాలు నాటుకుని ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతులకు ఈ వర్షం గొప్ప ఉపశమనం కలిగించింది. ఇప్పటివరకు వర్షాలు లేకున్నా, పొడి నేలల్లోనే విత్తనాలు నాటిన మండల రైతులు గత పక్షం రోజులుగా తీవ్ర ఆందోళన చెందారు. వీరికంటే ముందుగా నాటిన వారైతే వర్షాభావ పరిస్థితితో భూమిలో నాటిన గింజలు ఉబ్బిపోయి పగుళ్ల ఇవ్వడంతో కొన్ని కుళ్లిపోయాయి. ఇలా ఆరంభంలోనే పత్తి రైతులపై అదనపు భారం పడింది. ఇప్పటికే ఒకటి, రెండు అంగుళాల ఎత్తు ఎదిగిన ఎండుదశకు చేరుతున్న పత్తి మొక్కలకు ఈ చినుకులు మరింత ఊరటనిచ్చాయి. భూమిలో పదును సరిపోవడంతో , ఇంకా సాగు చేయాల్సిన పత్తి రైతులు సైతం విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమవుతున్నారు.

ఈ వర్షాలు మేలు చేస్తాయి..

వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఖరీఫ్‌ సాగు విరామం చేపట్టాలని భావించారు. అదును సమయంలో కాకుండా ముందే కురిసి ఆ తర్వాత వానలు పూర్తిగా పడక పోవడంతో ముందుస్తుగా సాగు చేసిన రైతులు రెండు సార్లు నాటుకోవాల్సిన వచ్చింది. దీంతో రూ.10వేలు విత్తు దశలోనే నష్టపోయారు. ఆ తర్వాత నాటుకున్న వారందరికీ ఈ వర్షాలు మేలు చేశాయి. ఎండతీవ్రంగా ఉన్నప్పుడే ఈనెల 15న ధైర్యం చేసి పత్తివిత్తనాలను నాటించాను. మరో 15 రోజులు ఎలాంటి ఇబ్బంది లేదు.

– ఉప్పుటూరు వెంకటేశ్వర్లు,
పత్తి రైతు, యడ్లపాడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



క్రోసూరు: మండలంలోని అనంతవరం శివారులో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ పి.రవిబాబు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన దండుబుడే(36) క్రోసూరులోని ఓ రెస్టారెంట్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో రాత్రి రెస్టారెంట్‌లో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా అనంతవరం దాటిన తరువాత రోడ్డుపై ఐద్రైలు అడ్డు రావటంతో బలంగా ఢీ కొనడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు, మొహానికి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య నాగుల్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించామని తెలిపారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు కలరు.

పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ బోనాల సమర్పణ



శాకంబరి అలంకారంలో పెద్దింటమ్మ అమ్మవారు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే పెద్దింటమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు పొంగళ్లు చేసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ మాస బోనాలు సమర్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దింటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ముప్పాళ్ళ: వ్యవసాయ సీజన్‌ ఆరంభం కావటంతో రైతులు సాగుకు కావాల్సిన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్‌.శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలను మాత్రమే అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు అనంతరం రశీదు తప్పనిసరిగా తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. విత్తన మొలక శాతం పరీక్షించుకున్న తర్వాతే సాగుకు శ్రీకారం చుట్టాలన్నారు. దుకాణదారులు కూడా రైతులకు బిల్లులు అందించాలని సూచించారు.

చెట్టును ఢీకొన్న మినీ ట్రక్కు

లారీలోని ఇద్దరు అన్నదమ్ములకు గాయాలు

శావల్యాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున మినీ ట్రక్కు చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు అన్నదమ్ములకు గాయాలయ్యాయి. శావల్యాపురం ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు.. గిద్దలూరు నుంచి చిలకలూరిపేటకు వంకాయల లోడుతో మినీ ట్రక్కు బయలుదేరింది. ఈక్రమంలో మార్గమధ్యంలో కృష్ణాపురం గ్రామ సమీపాన వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు అతివేగంతో చెట్టును ఢీకొట్టింది. ట్రక్కు డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న తమ్ముడు దమ్మవరపు శేఖర్‌ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా.. అన్న దమ్మవరపు బన్నికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దమ్మవరపు శేఖర్‌ను బయటకు తీశారు. రెండు కాళ్లు విరిగిపోగా.. 108 అత్యవసర వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనం ముందుభాగం పూర్తిస్థాయిలో దెబ్బతింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శక్తి యాప్‌పై కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన



క్రోసూరు: అతివల రక్షణ, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్‌ఐ పి.రవిబాబు అన్నారు. కేజీబీవీ విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళల్ని గౌరవించి, వారి సమస్య తెలుసుకునేందుకు మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శక్తి యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకుని ఆపదలో ఉన్నప్పుడు సమాచారమిస్తే 10 నిమిషాలలో పోలీసుల సహాయం అందుతుందన్నారు. డ్వాక్రా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, అన్ని వర్గాల మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైబర్‌ నేరాలపై పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ మరమ్మతు పనుల పరిశీలన



బెల్లంకొండ: నాగార్జునసాగర్‌ ప్రాజెక్టు ద్వారా కాలువల నుంచి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎర్రబాలెం మేజర్‌ కాలువ చైర్మన్‌ మాచర్ల ముస్తఫా తెలిపారు. ఆదివారం మండలంలోని ఎర్రబాలెం మేజర్‌ కాలువకు మరమ్మతు పనులను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మేజర్‌ కాలువకు గండ్లు పడి, పూడిక ఏర్పడి నీటి ప్రవాహానికి అంతరాయాలు కలుగుతుంటడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ ఆదేశాల మేరకు మేజర్‌ కాలువకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్పీ ఏఈ ఇబ్రహీం, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్‌ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌ షరీఫ్‌, బెల్లంకొండ సర్పంచ్‌ జ్యోతి సముద్రం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ టెక్నాలజీ ఇన్‌క్యుబేటర్స్‌తో 'ఏఎం రెడ్డి' ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న చైర్మన్‌ శాంతి శ్రీనివాసరెడ్డి, కేఎల్‌ టెక్నాలజీ సీఈఓ బాబు హరికృష్ణ

నరసరావుపేట రూరల్‌: ఏఎం రెడ్డి విద్యాసంస్థలతో, కేఎల్‌ టెక్నాలజీ ఇన్‌క్యుబేటర్స్‌ ఫౌండేషన్‌ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, కేఎల్‌ టెక్నాలజీ ఇన్‌క్యుబేటర్స్‌ ఫౌండేషన్‌ సీఈఓ బాబు హరికృష్ణ లంక, ఏసీఏసీ కేఎల్‌ స్టార్టప్స్‌ ఫౌండేషన్‌ సీఈఓ వి.రమాకాంత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్టార్టప్‌లు, పరిశోధన, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెరిగే విధంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. నూతన వ్యాపార ఆలోచనల అభివృద్ధి, టెక్నాలజీ కమర్షియలైజేషన్‌, స్టార్టప్‌ల విషయంలో ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సిహెచ్‌ మల్లికార్జున్‌, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.భార్గవభూషణరావులు పాల్గొన్నారు.

'నేను నా తరం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరిస్తున్న చేస్తున్న అతిథులు

నరసరావుపేట రూరల్‌: బహుభాషా కోవిదుడు లంకా సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ విద్యావేత్త లంకా సత్యనారాయణ రచించిన నేను నాతరం.. తన ఆత్మకథ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఇస్సపాలెంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో శ్రీనాథ సాహితీ పరిషత్‌ ఆంధ్ర చైతన్య గ్రూప్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శ్రీనాథ సాహితీ పరిషత్‌ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వామి స్కూల్‌ డైరెక్టర్‌ ఈఎస్‌ స్వామి, నరసరావుపేట కళావేదిక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, సంస్కృత అధ్యాపకులు డాక్టర్‌ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్‌ స్వామి మాట్లాడుతూ లంకా సత్యనారాయణ మూడు భాషల్లో ఎంతో పాండిత్యాన్ని గడించారని, ఎన్నో పుస్తకాలను తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించారని తెలిపారు. ఫౌండేషన్‌ ఫర్‌ ఎక్సలెన్స్‌ సంస్థకు కో–ఆర్డినేటర్‌గా ఉండి ఎంతో మంది పేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత అందిస్తున్నారని తెలిపారు. స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ నేను నా తరం పుస్తకం ద్వారా అనేక సామాజిక విషయాలను సత్యనారాయణ వెల్లడించారని తెలిపారు. కార్యక్రమంలో పద్య కవి ఈవూరి వెంకటరెడ్డి, మేళ్లచెరువు వీరాంజనేయులు, కెవికె రామారావు, బత్తుల మురళీ జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సీఆర్‌ మోహన్‌



సీఆర్‌ మోహన్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: కార్మిక, కర్షక ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన పోరాట యోధుడు సీఆర్‌ మోహన్‌ అని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు కొనియాడారు. సీనియర్‌ కమ్యూనిస్టు నాయకుడు సీఆర్‌ మోహన్‌ సంస్మరణ సభ ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సీఆర్‌ మోహన్‌ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చివరిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి శ్రమించిన నాయకుడు సీఆర్‌ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ జిల్లా కార్యదర్శి షేక్‌ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు, తుబాటి సుభాని, చెరుకుపల్లి సృజన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి మున్సిపల్‌ కార్మికుల నిరసన



పిడుగురాళ్ల: పట్టణంలోని ఐలాండ్‌ సెంటర్‌లో నిర్వహిస్తున్న ప్రదర్శనలో భాగంగా ఆదివారం మున్సిపల్‌ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఇంజినీరింగ్‌ కార్మికులకు జీవో నంబర్‌ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్మికులకు కూడా తల్లికి వందనం, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌, సమ్మె కాల ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ఆషాఢ బోనాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ గుడిలో ఆదివారం ఆషాఢ బోనాలతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పట్టణంలోని పలు వార్డుల నుంచి మహిళలు బోనాలతో గుడి వద్దకు చేరుకున్నారు.అక్కడే బోనాలను వండి అమ్మవారికి సమర్పించారు. మరికొందరు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బట్లూరులో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు సేవ చేయడంలో హెల్ప్‌ ఫౌండేషన్‌ ఎప్పుడు ముందు ఉంటుందని, ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బట్లూరు సర్పంచ్‌ ఈదర రామారావు అన్నారు. మండలంలోని బట్లూరు గ్రామంలో హెల్ప్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం సహకారంతో తెనాలికి చెందిన నేత్రాలయ ఐ కేర్‌, సత్తెనపల్లికి చెందిన శ్రీ సాయికృష్ణ డెంటల్‌ కేర్‌ వారిచే ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కంటి, దంత సమస్యలకు వైద్యులు చెప్పే సలహాలు, సూచనలు పాటించి మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉండాలన్నారు. శ్రీ సాయికృష్ణ డెంటల్‌ కేర్‌ హాస్పిటల్‌ వైద్యులు శివరామకృష్ణ మాట్లాడుతూ నోటి పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. నోటి దుర్వాసన, దంతాల నుంచి చీము కారటం లాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నేత్రాలయ ఐ కేర్‌ వైద్యులు వినీల మాట్లాడుతూ కంటి సంరక్షణ చాలా ప్రాముఖ్యమైనదని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు, 80 మందికి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు సిద్ధార్థ, సుభాని, హెల్ప్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత, చందు, భవాని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.